ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.5
కనిష్ఠం 24.0
ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి
5
సోమవారం 5 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	576.10 (271.9007)	4,27,711	37,873
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.86 (3.66)	56.93	536.13
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	127.62 (5.90)	25,637	10,267

చికెన్ ధరలు | లైవ్: రూ.124 | డ్రెస్: రూ.200 | స్కిన్‌లెస్: రూ.230

బకాయిలు వసూలు చేయండి



- అధికారుల నిర్లక్ష్యంపై ఆడిట్‌శాఖ కొరడా
- నార్కట్‌పల్లి పశువులసంత కాంట్రాక్టర్, చెర్వుగట్టు కొబ్బరికాయల కాంట్రాక్టర్ల బకాయిల ప్రస్తావన
- చిట్యాల, చండూరు మార్కెట్లకు అద్దె బకాయిలు వసూలు చేయాలని ఆదేశం
- హాలియా మార్కెట్‌లో ఓ ఉద్యోగికి రెండు డీఏలపై నిలదీత
- 2020-21 ఆర్థిక సంవత్సరానికి స్థానిక సంస్థల ఆడిట్ నివేదిక బహిర్గతం
- ఆదాయపు పన్ను చెల్లించని నల్లగొండ గ్రంథాలయ అద్దె కారు యజమాని

స్థానిక సంస్థలకు రావాల్సిన బకాయిలను వసూలు చేయడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని రాష్ట్ర ఆడిట్‌శాఖ బట్టబయలు చేసింది. స్థానిక సంస్థలైన పంచాయతీలు, మునిసిపాలిటీలు, వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో దుర్వినియోగమైన నిధులు, పేరుకుపోయిన బకాయిలు, అధిక ఖర్చులు, అక్రమాలను ఆడిట్‌శాఖ తన నివేదికలో వెల్లడించింది.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

జిల్లాలో 2020-21 సంవత్సరానికి స్థానిక సంస్థలకు సంబంధించి నిర్వహించిన ఆడిట్ నివేదికను తాజాగా రాష్ట్ర ఆడిట్‌శాఖ విడుదల చేసింది. నల్లగొండ జిల్లాలో నార్కట్‌పల్లి పశువుల సంత, చెర్వుగట్టు కొబ్బరికాయల వేలం కాంట్రాక్టర్ల బకాయిలను ఆడిట్‌లో గుర్తించింది. అదేవిధంగా చిట్యాల, చండూరు మార్కెట్ కమిటీలకు పౌరసరఫరాలశాఖ ఇతర సంస్థల నుంచి రావాల్సిన బకాయిల వసూలకు ఆదేశించింది. హాలియా మార్కెట్‌లో ఒక ఉద్యోగికి రెండు డీఏలు చెల్లించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. నల్లగొండ జిల్లా గ్రంథాలయసంస్థ కారు కాంట్రాక్టర్ ఆదాయపు పన్ను చెల్లించని విషయాన్ని కూడా పట్టుకున్న ఆడిట్‌శాఖ స్పష్టమైన ఆదేశాలిస్తూ నివేదికను వెల్లడించింది.

నార్కట్‌పల్లి పశువుల సంతకు రూ.2.16లక్షలు బకాయి

నార్కట్‌పల్లి గ్రామపంచాయతీకి సంబంధించి 2020-2021 సంవత్సరానికి పశువుల సంత కాంట్రాక్ట్‌ను జి.రమేష్ అత్యధికంగా రూ.26,01,00 బిడ్డింగ్‌తో కాంట్రాక్ట్ పొందాడు. కాలపరిమితి ముగిసేంతవరకు రూ.23,84,250 మాత్రమే పంచాయతీకి చెల్లించగా, రూ.2,16,750 బకాయి ఉన్నట్లు ఆడిట్‌శాఖ గుర్తించింది. సదరు కాంట్రాక్టర్ నుంచి సంబంధిత మొత్తాన్ని తక్షణమే రికవరీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆడిట్ శాఖ ప్రభుత్వానికి సూచించింది. సదరు కాంట్రాక్టర్ నెలనెలా పంచాయతీకి చెల్లించాల్సిన బకాయిలను పాలకవర్గం, ఉద్యోగులతో కుమ్మక్కు కావడంతో పాటు, కీలకమైన రాజకీయ నేత అండదండలుండడంతోనే చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి.

చిట్యాల ఏఎంసీకి పౌరసరఫరాలశాఖ బకాయి రూ.25.54లక్షలు

చిట్యాల వ్యవసాయ మార్కెట్ (ఏఎంసీ) పరిధిలో ఉన్న గోదాములను 2021 ఏప్రిల్ వరకు అద్దెకు తీసుకున్న పౌరసరఫరాలశాఖ రూ.25,54,801 బకాయి పడిందని ఆడిట్ సంస్థ గుర్తించింది. ఈ బకాయిలను తక్షణమే వసూలు చేసి మార్కెట్ కమిటీకి జమచేయాలని ఆదేశించింది. అదేవిధంగా చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి గోదాములు, దుకాణాల అద్దెల రూపంలో 2020 మే నాటికి కాటన్‌కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నుంచి రూ.2,97,480, సివిల్‌సప్లయిస్ కార్పొరేషన్ నుంచి రూ.60,060, మరో ఇద్దరు ప్రైవేట్ వ్యక్తుల నుంచి రూ.11,350 కలిపి మొత్తం రూ.3,81,250 బకాయిలను తక్షణమే వసూలు చేయాలని ఆడిట్‌శాఖ నిర్దేశించింది.

హాలియా మార్కెట్‌లో ఒక ఉద్యోగికి రెండు డీఏలు

హాలియా మార్కెట్ కమిటీలో ఒక ఉద్యోగికి రూ.19,747 చొప్పున రెండు సార్లు డీఏలు చెల్లించారని, అందులో ఒక డీఏ చెల్లింపు అదనంగా జరిగిందని ఆడిట్‌శాఖ గుర్తించింది. ఈమొత్తాన్ని సదరు ఉద్యోగి వ్యక్తిగత ఖాతా నుంచి రికవరీ చేయాలని ఆదేశించింది.

చెర్వుగట్టు కొబ్బరికాయల కాంట్రాక్టర్ బకాయి రూ.4.70లక్షలు

చెర్వుగట్టు గ్రామపంచాయతీలో 2020 జనవరి 1వ తేదీ నుంచి 2021 డిసెంబరు 31వ తేదీ వరకు కొబ్బరికాయల విక్రయానికి సంబంధించిన వేలాన్ని దక్కించుకున్న సీ.శంకర్ రూ.33,20,000 గ్రామపంచాయతీకి చెల్లించాల్సి ఉండగా, అందులో రూ.28,50,000 మాత్రమే చెల్లించాడు. ఇంకా రూ.4,70,000 గ్రామపంచాయతీకి కాంట్రాక్టర్ బకాయి ఉన్న విషయాన్ని ఆడిట్‌శాఖ గుర్తించింది. ఈ మొత్తాన్ని తక్షణమే వసూలు చేసి గ్రామపంచాయతీకి జమచేయాల్సిందిగా ప్రభుత్వానికి సూచించింది. ఈ బకాయికి సంబంధించి కూడా రాజకీయ జోక్యంతోనే నిధులు పక్కదారి పట్టి ప్రభుత్వానికి జమకాలేదని, అందువల్లే ఈ బకాయి పేరుకుపోయిందని స్థానికులు చెబుతున్నారు.

నల్లగొండ లైబ్రరీ అద్దె వాహనం టీడీఎస్ చెల్లించలేదని గుర్తింపు

నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, కార్యదర్శి 2020-21లో రూ.5,94,000కు అద్దె వాహనాన్ని వినియోగించారు. ఆదాయపన్ను శాఖ నిబంధనల ప్రకారం రూ.30వేల విలువ దాటిన ఏ కాంట్రాక్ట్ అయినా కాంట్రాక్ట్ మొత్తంలో ఆదాయపన్నుశాఖకు రెండు శాతం టీడీఎస్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే వాహన కాంట్రాక్టర్ సదరు పన్ను చెల్లించలేదని ఆడిట్ సంస్థ గుర్తించింది. తక్షణమే సదరు కాంట్రాక్టర్ నుంచి రెండు శాతం అంటే రూ.11,880 వసూలు చేసి ఆదాయపన్నుశాఖకు టీడీఎస్ చెల్లించాలని ఆడిట్‌శాఖ ఆదేశించింది.

వానొస్తే.. సెల్లార్లే సెలయేర్లు

- ఉమ్మడి జిల్లాలో ఇష్టానుసారంగా సెల్లార్ల నిర్వహణ
- ఇరుకు ప్రదేశంలో వ్యాపారాల నిర్వహణ
- చౌటుప్పల్‌లో నీట మునిగిన సెల్లార్లు
- భువనగిరిలో విద్యుదాఘాతంతో నష్టం
- అయినా చలనం అంతంతే



భువనగిరి పట్టణంలో ప్రమాదకరంగా ఉన్న సెల్లార్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మునిసిపాలిటీల్లోని వ్యాపార సముదాయాల్లోని సెల్లార్ల నిర్వహణ ప్రమాదకరంగా తయారైంది. మిర్యాలగూడ, చౌటుప్పల్, భువనగిరి పట్టణాల్లో గత కొన్నేళ్లలో పలు పర్యాయాలు నీటి మునిగి ఆస్తి నష్టంతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ అధికారుల్లో కానీ, భవన యజమానుల్లో కానీ తీరుమారలేదు. ఖాళీగా ఉంచడంతోపాటు పార్కింగ్‌కు కేటాయించాల్సిన స్థలాన్ని వ్యాపార సముదాయాలకు వినియోగిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జనసమూహం సెల్లార్లలో ఉండగా ఏదైనా ప్రమాదం జరిగితే ఇక అంతే సంగతులు. చౌటుప్పల్‌లో ఐదారు పర్యాయాలు నీట మునిగినా అధికారులు వాటిని మూయించలేకపోయారు. ఇదిలా ఉండగా సెల్లార్లలో వ్యాపారాల నిర్వహణతో అక్కడికి వచ్చే ప్రజలు వాహనాలను రోడ్డుపైనే నిలపడంతో ఇటు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతోంది.

● భువనగిరి టౌన్, చౌటుప్పల్ టౌన్

ఒట్టిపోతున్న చెరువులు, కుంటలు

● వానాకాలం ఆరంభమై రెండు నెలలవుతున్నా జాడలేని వర్షాలు ● ముదురుతున్న వరినార్లు ● ఇప్పటికి పూర్తయిన నాట్లు 50శాతం లోపే.. ● ఎండలకు వాడుతున్న పత్తి చేలు

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాకాలం ప్రారంభమై సుమారు రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు భారీ వర్షాలు కురవకపోవడంతో వాగులు, వంకలు ఒట్టిపోయాయి. వరద నీరు రాక చెరువులు, కుంటలు నీరులేక వెలవెలబోతున్నాయి.

● మోత్కూరు

జిల్లాలో చెప్పుకోదగిన ప్రాజెక్టులు లేకపోవడంతో వర్షాధారంపైనే పంటలు సాగవుతున్నాయి. పూర్తి వర్షాధారంపైనే మెట్టపంటలు సాగవుతుండగా చెరువులు, కుంటలు, బావులు, బోర్లపై ఆధారపడి రైతులు వరిసాగు చేస్తున్నారు. చెరువులు, కుంటలు నిండకపోవడంతో బావులు, బోర్లలో కూడా నీరు లభించక వరినాట్లకోసం బురద దుక్కులు సాగక నార్లు ముదిరిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సగం కూడా పూర్తికాని వరి నాట్లు

జిల్లాలో సుమారు 3లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా. భారీ వర్షాలు కురవక చెరువులు, కుంటల్లోకి నీరు రాక, బిక్కేరులోనూ నీరు లేక, బావులు, బోర్లలో భూగర్భజలాలు పెరగక రైతులు వరి నాట్లు వేయలేకపోతున్నారు. సన్న వరి సాగుకు రోహిణి కార్తెలో, దొడ్డు రకాల పంటలకు ఆరుద్ర కార్తెల్లో నార్లు పోస్తారు. నారు పోసిన 45రోజుల్లో సన్నవరి నాటు, నెల రోజుల్లో దొడ్డు రకం వరి నాటు వేయాల్సి ఉంటుంది. భారీ వర్షాల్లేక నీరు లేక బురద దుక్కులు దున్నలేక సకాలంలో వరి నాట్లు వేయలేక పోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. నార్లు ముదిరిపోతున్నాయంటున్నారు.

జిల్లాలో తగ్గిన వర్షపాతం

వానాకాలం ప్రారంభం నుంచి ఇప్పటివరకు చూస్తే వర్షపాతం కొన్ని మండలాల్లో సాధారణం కంటే కొంత ఎక్కువగా ఉండగా చాలా మండలాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 25.42 సెం.మీ.ల సాధారణ వర్షపాతం కురవాల్సి ఉండగా, 24.0 సెం.మీ.ల వర్షపాతమే నమోదైంది. జిల్లాలో 1,011 చెరువులు, కుంటలుండగా, వీటి పరిధిలో 51,325 ఎకరాల ఆయకట్టు ఉంది. జిల్లాలో ఇప్పటివరకు 26 చెరువులు మాత్రమే నిండాయని, నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. బీమలింగం కాల్వ ద్వారా నీరొచ్చే సౌకర్యం ఉన్న మోత్కూరు మండలం పాలడుగు, దత్తప్పగూడెం చెరువుల్లోకి, బృందావన్ కాల్వ ద్వారా నీరు వచ్చే సౌకర్యం ఉన్న మోత్కూరు, కొండగడప, పాటిమట్ల తదితర చెరువుల్లోకి ఇంతవరకు చుక్క నీరు రాలేదు. గుండాల మండలంలో చెరువులు, కుంటలు నింపేందుకు దేవాదుల కాల్వ ఉన్నా అందులోనూ నీరు వదలడం లేదు. చెరువులు, కుంటలు నిండకపోవడంతో బావులు, బోర్ల కింద సాగు సాగడంలేదు. ఇకనైనా నాలుగైదు భారీ వర్షాలు కురిస్తేనే ఇటు పత్తి, కంది పంటలకు మేలు జరగడంతోపాటు చెరువులు, కుంటల్లో నీరు వచ్చి, తద్వారా బావులు, బోర్లలో భూగర్భజలాలు పెరిగి వానాకాలం వరి నాట్లు పుంజుకుంటాయి.



వాడుతున్న పత్తి, కంది చేలు

జిల్లాలో లక్షా461 ఎకరాల్లో పత్తి, 1,249 ఎకరాల్లో కంది సాగుచేశారు. మెట్ట పంటలకు అవసరమైన వర్షాలు కూడా కురవడంలేదు. ఇటీవల జూలై 15నుంచి నెలాఖరు వరకు ముసురు వచ్చినా, రోజూ చిటపట చినుకులే తప్ప భారీ వర్షం కురవలేదు. దీంతో మెట్టపంటల భూమి సరిగా తడవ లేదు (పదును కాలేదు). రైతులు గుంటుకలు తోలి, ఎరువులు వేశారు. గుంటుకలు తోలిన తర్వాత వర్షం కురవకపోవడంతో పదను ఆరిపోయి, ఇటీవలి ఎండలకు పత్తి, కంది చేలు వాడిపోతున్నాయి. పత్తిచేను పూత, గూడ దశలో ఉంది. ఇప్పుడు పత్తికి నీరు ఎక్కువగా అవసరం. ఇప్పుడు వర్షం కురిస్తే పత్తి చేనుకు మేలు జరుగుతుంది. ఇంకో వారం, పది రోజులు ఇలాగే ఎండలు ఉండి, ఆ తర్వాత వర్షం కురిస్తే గూడ, పూత రాలుతుందని రైతులు చెబుతున్నారు.



వేసిన వరినాటు పూర్తిగా ఎండింది

భూమి కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నా. బావి కింద రెండు నెలల క్రితం ఎకరం పది గుంటలు వరి నాటు వేశాను. వర్షాలు లేక భూగర్భజలాలు తగ్గి కంకిదశలో ఉన్న వరి పంట ఎండింది. జూలైలో కురిసిన వర్షాలకు మరో బావి కింద మళ్లీ ఎకరం నాటు వేశా. ఇటీవలి ఎండలకు అదీ ఎండింది. వర్షాల్లేక వరినాటుకు పెట్టిన పెట్టుబడి, భూమి కౌలు నష్టపోయాను. దీన్ని ప్రకృతి వైపరీత్యంగా పరిగణించి ప్రభుత్వం ఆదుకోవాలి.

లోతుకుంట స్వామి, కౌలు రైతు, పనకబండ



'స్థానిక' ఎన్నికల్లో సత్తాచాటాలి

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 4: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాచాటాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు. ఆదివారం గుట్టలో ఆలేరు, ఆత్మకూరు(ఎం), మోటకొండూర్, గుండాల మండలాలకు చెందిన మొత్తం 240 సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చెక్కులు ఇచ్చి, వాటికి డబ్బులు ఖర్చు అయ్యాయని లబ్ధిదారులనుంచి రూ.వేలు వసూలు చేసే వారని ఆరోపించారు. ప్రజా పాలనలో అలా జరగకుండా నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు, రూ.2లక్షల రుణమాఫీ ప్రజలకు వివరించి కాంగ్రెస్‌కు ఓటు వేసేలా, అందరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. ఇప్పటికే ఆలేరు నియోజకవర్గానికి రూ.100కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మునిసిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేశం, గుండ్లపల్లి వాణి భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుట్టలో భక్తుల సందడి

● ప్రత్యేక, ధర్మదర్శనాల్లో భక్తుల సందడి ● యాదగిరీశుడికి వైభవంగా నిత్యపూజలు



యాదగిరికొండపై తిరుమాడవీధుల్లో భక్తుల రద్దీ

ఆపన్నులకు అండగా 'రైతుబీమా'

● జూన్ 28 వరకు పాస్ పుస్తకం ఉన్నవారు అర్హులు ● రైతుబీమా దరఖాస్తుకు నేడే చివరి తేదీ



అడ్డగూడూరు, ఆగస్టు 4: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా పథకం అన్నదాతల కుటుంబాలకు అండగా నిలుస్తోంది. రైతు అకాల మరణం లేదా సహజ మరణం చెందితే ఆయన కుటుంబం వీధిన పడొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ప్రభుత్వమే జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)కు ప్రీమియం చెల్లించి మృతి చెందిన రైతు కుటుంబాలకు ప్రమాద బీమా సొమ్మును అందిస్తోంది. ఏటా ప్రభుత్వమే రెన్యూవల్ చేస్తోంది. ఈ సంవత్సరం జూన్ 28వరకు పట్టాదారు పాసు పుస్తకం కలిగి ఉన్న వారు కొత్తగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 5వ తేదీ వరకు అవకాశం కల్పించింది. గతంలో దరఖాస్తు చేసుకున్న రైతులు తమ ఆధారు, బ్యాంక్ ఖాతాలో మార్పులు లేదా నామినీ చనిపోతే పేరు మార్పుకోసం గత నెల 30 వరకు దరఖాస్తుకు చివరి అవకాశం ఉండగా, దాన్ని ఈ నెల 5 వరకు పొడిగించారు.

చేయాల్సింది ఇలా..

వ్యవసాయ భూమి కొనుగోలు చేసినా లేక తమ పేరిట భూమి మార్పిడి చేసుకున్న వ్యవసాయ భూమిని ధరణిలో పట్టా చేయించుకున్న రైతులు 18 ఏళ్ల నుంచి 59ఏళ్లలోపు వారు మాత్రమే దరఖాసు చేసుకోవాలి. 1965 ఆగస్టు 14 నుంచి 2006 ఆగస్టు 14మధ్యలో జన్మించిన రైతులు అర్హులు. పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధారు కార్డు, నామిని ఆధార్ జీరాక్స్ పత్రాలతో కలిపి రైతు బీమా ఫాంలో వివరాలు నమోదు చేసి పట్టాదారు స్వయంగా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో)కి అందజేసి నమోదు చేయించుకోవాలి.

హామీలను అమలు చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

భువనగిరి టౌన్, ఆగస్టు 4: కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. భువనగిరిలో ఆదివారం జరిగిన ఏఐటీయూసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికులకు సంవత్సరానికి ఇస్తామన్న రూ.12వేలు వెంటనే విడుదల చేయాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల గౌరవ భృతి ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.18వేల వేతనం ఇవ్వాలని, రెండో ఏఎన్ఎంల వేతనాలు పెంచాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రక్షాళన చేయాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోరేటి రాములు, ఎండీ ఇమ్రాన్, పిల్లి శంకర్, వెంకటేష్, సోమన సబిత, తదితరులు పాల్గొన్నారు.

ఒకే గదిలో.. రెండు తరగతులు

ప్రభుత్వాలు మారినా విద్యార్థుల సమస్యలు మాత్రం తీరడం లేదు. గతంలో 'మన ఊరు- మన బడి' పథకం కింద చేపట్టిన నిర్మాణాలు కొన్నిచోట్ల నిలిచిపోయాయి. జిల్లా కేంద్రంలో గంజ్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో సుమారు 400కుపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. తరగతి గదులు సరిపోకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారు. 8వ తరగతిలో 35 మంది విద్యార్థులు, 9వ తరగతిలో 39మంది విద్యార్థులకు ఒకేగదిలో మధ్యలో పరదా అడ్డుగా పెట్టి, పాఠాలు బోధిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతిలో 20మంది, 3వ తరగతిలో 18మంది విద్యార్థుల పరిస్థితి ఇంకా విచిత్రంగా ఉంది. ఒకరికి హోంవర్క్ ఇచ్చి, మరొకరికి పాఠాలు చెబుతుంటారు. కానీ, ఉపాధ్యాయులు ఏం చెబుతారో విద్యార్థులకు అర్థం కాని పరిస్థితి. ఒకే గదిలో రెండు తరగతులతో విద్యార్థుల్లో గందరగోళం నెలకొంటోంది. మిగతా తరగతులు కూడా ఇరుకుగానే ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారుల దృష్టి సారించి మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి



భువనగిరి గంజ్ పాఠశాలలో ఒకే గదిలో పరదా ఉంచి రెండు తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

క్లిక్ క్లిక్



యాదగిరికొండపై భక్తుల రద్దీ

ప్రత్యేక, ధర్మదర్శనాల్లో భక్తుల సందడి ● యాదగిరిగుట్ట ఆలయ ఈఈ సస్పెన్షన్




నిత్య కల్యాణంలో భాగంగా హోమం నిర్వహిస్తున్న అర్చకులు, యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట తిరువీధుల్లో భక్తుల సందడి

భువనగిరి అర్బన్, ఆగస్టు 4: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో ఆదివారం యాదగిరికొండపై రద్దీ నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. సుమారు 20వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో రద్దీగా కన్పించాయి. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో వద్ద భక్తుల రద్దీ ఉండగా ఆలయ ఉత్తర దిశలో ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. అదే విధంగా భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లుచేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.27,09,469 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు.

7వ తేదీన హుండీ కానుకల లెక్కింపు

లక్ష్మీనృసింహుడిని దర్శించుకునే భక్తులు సమర్పించే మొక్కు కానుకలను ఈ నెల 7వ తేదీన కొండకింద సత్యదేవుని వ్రత మండపంలో లెక్కించనున్నట్లు ఈవో భాస్కరరావు తెలిపారు.

యాదగిరిగుట్ట ఆలయ ఈఈ రామారావు సస్పెన్షన్

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో ఎలక్ట్రికల్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న ఊడెపు వెంకటరామారావు ఆదివారం సస్పెండ్ అయ్యారు. ఆలయంలో ఈఎన్ఎం శాఖలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఎలాంటి అనుమతులు లేకుండా 12మందిని నియమించారు. గతంలో వచ్చిన ఆరోపణలు, స్థానికంగా పలు ఫిర్యాదులు రావటంతో విచారణ చేపట్టిన ఈవో సస్పెండ్ చేశారు. ఈమేరకు సివిల్ ఈఈ దయాకర్‌రెడ్డికి అదనంగా ఎలక్ట్రికల్ ఈఈగా బాధ్యతలు అప్పగించారు.

వానొస్తే.. సెల్లార్లే సెలయేర్లు

దేశ రాజధాని ఢిల్లీలో సెల్లార్‌లోకి వరదనీరు చేరి సివిల్స్‌కు శిక్షణ పొందుతున్న ముగ్గురు విద్యార్థులు మృతి చెందడంతో సెల్లార్ల వ్యవహారం అంతటా చర్చనీయాంశమైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మునిసిపాలిటీల్లో నిబంధనలకు వ్యతిరేకంగా, అధికారుల అలసత్వాన్ని ఆసరాగా చేసుకుని సెల్లార్లను వాణిజ్య కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. వాహనాల పార్కింగ్ పేరిట నిర్మించిన సెల్లార్లను వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారు. వర్షం వచ్చిందంటే నీరు చేరి ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. అదేవిధంగా ఆరుబయట రహదారిపై వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో భారీ వర్షాలకు భువనగిరి పట్టణంలో నష్టం వాటిల్లినా వ్యాపారుల్లో, అధికారుల్లో మార్పు రాలేదు.

- వర్షం వచ్చిందంటే వరద నీరు చేరాల్సిందే
- పార్కింగ్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- చూసీ చూడనట్లుగా వదిలేస్తున్న అధికారులు
- అనుమతులు కొంత.. నిర్మాణాలు కొండంత


యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 2021లో సర్వీస్ రోడ్డులో ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్ ఫొటో)

● ప్రమాదం చోటుచేసుకున్నా మారలే..

భువనగిరి టౌన్, ఆగస్టు 4 : వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్న సెల్లార్లు భువనగిరి మునిసిపల్ పరిధిలో 20కి పైగా ఉండగా రెండింటికి మాత్రమే నిర్మాణ అనుమతులు ఉన్నాయి. మిగతావన్నీ అక్రమ నిర్మాణాలుగా ప్రజలు ఆరోపిస్తున్నారు. గత వర్షాకాలంలో భారీ వర్షాలకు సెల్లార్లలోకి వరద నీరు చేరి అద్దెకుంటున్న వ్యాపారులకు రూ.లక్షల్లో నష్టం జరిగింది. కొన్ని సెల్లార్లలో వర్షపునీటి కారణంగా విద్యుదాఘాతం కూడా సంభవించింది. దీంతో చర్యల పేరిట అధికారులు భవన యజమానులకు నోటీసులు జారీ చేశారు. కాని నేటికీ సెల్లార్లలో ఎలాంటి మార్పులు రాకపోగా నూతనంగా నిర్మించిన సెల్లార్లు కూడా వ్యాపారాలకు అడ్డాగా మారాయి. సెల్లార్లలో నిర్వహించే వ్యాపారాల కోసం వచ్చే వారి వాహనాల పార్కింగ్‌తో కూడా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో పాటు మునిసిపాలిటీకి ఆస్తిపన్ను, ట్రేడ్ పన్ను తదితర రూపకాల్లో నష్టం వాటిల్లుతోంది.

సెల్లార్లలో ఆసుపత్రి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణ మెయిన్‌రోడ్డులోని సెల్లార్లలో ఆసుపత్రులు, ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే ఒక్కసారి వరద నీరు సెల్లార్లలోకి వరద చేరే ప్రమాదం ఉంది. అయినా సెంటర్‌లోని సెల్లార్‌లో ఆసుపత్రిని ఏర్పాటుచేశారు. లింగగిరి రోడ్డులో ఎంటర్‌ప్రైజెస్, మెటల్ షాప్, మిర్యాలగూడ రోడ్డులోని సెల్లార్‌లో సెల్ షాప్, కొత్తబస్టాండ్ సమీపంలోని మరో రెండుసెల్లార్లలో మెకానిక్ షాపులు, మోటార్ షోరూంలు నిర్వహిస్తున్నారు. మొత్తంగా ఏడు దుకాణాలను సెల్లార్లలో నిర్వహిస్తున్నారు. గతంలో సెల్లార్లలోని వరద నీరు వచ్చి చేరింది.

● కాగితాల్లో ఒకలా.. క్షేత్రస్థాయిలో మరోలా

రామగిరి: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో పెద్దసంఖ్యలో అపార్ట్‌మెంట్లు వెలిశాయి. వీటిలో సెట్‌బ్యాక్, ఫైర్‌వాహనం చుట్టూ తిరిగేలా స్థలం కేటాయించాల్సి ఉన్నా ఆ నిబంధనలకు నీళ్లొదిలి ఇష్టానుసారంగా నిర్మించారు. అయినా అధికారులు చోద్యం చూస్తున్నారు. కాగితాల్లో నిబంధనలు పాటిస్తున్నట్లు ఉన్నా, క్షేత్రస్థాయిలో అవేవీ కనిపించవు. పట్టణంలో సుమారు 500కు పైగా అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటిలోని సెల్లార్ స్థలాన్ని కేవలం పార్కింగ్‌కి మాత్రమే ఉపయోగించాల్సి ఉండగా కొన్నిచోట్ల లైబ్రరీలు,ఫంక్షన్‌హాల్స్, ఆఫీసరూంలు నిర్వహిస్తున్నారు. ప్రకాశంబజార్‌లోని కొన్నింటిలో ఆసుపత్రులు, ల్యాబ్‌లను ఏర్పాటుచేశారు. ఆసుపత్రులకు వచ్చే వారి వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. సెల్లార్‌లో వాహనం పెట్టే అవకాశం లేక రోడ్డుకు ఇరువైపులా పెట్టిన వాహనయజమానులకు పోలీసులు జరిమానా విధించిన సంఘటనలూ ఉన్నాయి. రెండేళ్ల కిందటి వరదలకు సెల్లార్లలోకి వరదనీరు చేరి అపార్ట్‌మెంట్ వాసులు మూడు రోజుల పాటు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. అంతేకాకుండా వరద నీటిని మోటార్లతో ఎత్తిపోయాల్సిన పరిస్థితి నెలకొంది. సెల్లార్‌లో వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు.

నోటీసులు ఇస్తాం

సెల్లార్‌ను పార్కింగ్, జనరేటర్ ఏర్పాటుకోసం ఉపయోగించాలి. వ్యాపారాలు కాదు. అపార్ట్‌మెంట్లలోని సెల్లార్‌లో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి నోటీసులు ఇస్తాం. అప్పటికీ స్పందించకపోతే చట్టరీత్య చర్య తీసుకుంటాం.

\- సయ్యద్ ముసాబ్ అహ్మద్, కమిషనర్, నల్లగొండ



అమలుకాని నిబంధనలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణం వేగంగా విస్తరిస్తుండగా 48 వార్డుల్లో గృహాలతో పాటు వ్యాపారసముదాయాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణ జనాభా లక్షన్నరకు చేరుకోగా సుమారు 26వేలకు పైగా నిర్మాణాలున్నాయి. 2,207 గృహేతర భవనాలు, 1,592 మిశ్రమ భవనాలున్నట్లు అధికారులు తెలిపారు. అయితే మునిసిపల్ నిబంధనలు ఎక్కడా అమలు కావట్లేదు. భవన నిర్మాణాల అనుమతులు కాగితాలలో చూపేది ఒకటైతే క్షేత్రస్థాయిలో నిర్మాణాలు మరోరకంగా ఉంటున్నాయి. ప్రధానంగా కమర్షియల్ కాంప్లెక్స్‌లలోని సెల్లార్లను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నారు. సాగర్‌రోడ్‌లోని హనుమాన్‌పేట, రెడ్డీకాలనీ, నల్లగొండ రోడ్డులోని రాంచంద్రాగూడెం, రౌండ్‌చౌరస్తా, సీతారాంపురం, గుంటూరు రోడ్డులోని విద్యానగర్, హౌసింగ్‌బోర్డులలో నిర్మించిన బహుళ అంతస్తుల వ్యాపార సముదాయాల్లో నిబంధనలు పాటించిన నిర్మాణాలు ఒకటి, అర మాత్రమే. హనుమాన్‌పేట ప్రాంతంలో మురుగుకాల్వలను ఆక్రమించి కట్టిన దుకాణ సముదాయాల్లోని సెల్లార్లు వర్షాకాలంలో జలపాతాలను తలపిస్తుండగా, నల్లగొండ రోడ్డులోని సెల్లార్లు బావులను తలపిస్తున్నాయి. ఏడెనిమిదేళ్ల క్రితం రాజీవ్ చౌరస్తాలోని సెల్లార్‌లోకి వరద నీరు చేరితే మోటార్లతో నీటిని తోడేశారు. ఇక మూడేళ్ల క్రితం హనుమాన్‌పేటలోని షాపింగ్ కాంప్లెక్స్‌లోకి భారీగా వరద నీరు చేరగా వ్యాపారులకు నష్టం వాటిల్లింది.

● చౌటుప్పల్‌లో తలాపునే ప్రమాదం

చౌటుప్పల్ టౌన్: చౌటుప్పల్ పట్టణంలోని చెరువు కింది ప్రాంతాల్లోని సెల్లార్లు ప్రమాదకరంగా మారాయి. రెండు, మూడేళ్లలో ఐదు పర్యాయాలుగా వచ్చిన వరదలతో పాటు చెరువు అలుగు నీరు అనేక సెల్లార్లలోకి చేరి యజమానులు తీవ్రఇబ్బందులను ఎదుర్కొన్నారు. పట్టణంలో పైభాగంలో ఉన్న చెరువు నుంచి ఊట జలాలు సెల్లార్లలోకి రావడంతో యజమానులు అష్టకష్టాలు పడ్డారు. అనేక కుటుంబాలు ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాయి. సెల్లార్లలో నీరు నెలల తరబడి నిలిచి యజమానులకు తీవ్రనష్టాలను కలిగించింది. సెల్లార్లలోని నీటిని తోడేందుకు అగ్నిమాపక వాహనాలను ఉపయోగించారు. వరద తగ్గిన తర్వాత కూడా ఐదారు నెలల పాటు సెల్లార్లలో ఊట నీరు చేరింది. వాటిని మోటార్లసాయంతో బయటకు పంపించారు.

రహదారికి ఇరువైపులా

చౌటుప్పల్‌లో ప్లాట్ల ధరలు పెరగడంతో యజమానులు అండర్ గ్రౌండ్(సెల్లార్) నిర్మాణాలపై దృష్టి సారించారు. జాతీయరహదారికి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లతో పాటు తంగడపల్లి రోడ్డు, లింగారెడ్డిగూడెం రోడ్డు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ రోడ్డు, హ్యాండ్లూమ్ మార్కెట్ రోడ్డు, చిన్నకొండూరు రోడ్డులలో సెల్లార్ నిర్మాణాలు చేపట్టారు. ఆయా రోడ్లలో 156మడిగెలకు అండర్ గ్రౌండ్ నిర్మాణాలు ఉండగా, వీటిలో 10కి పైగా నివాసగృహాలు ఉన్నాయి. రెండు పేరొందిన కమర్షియల్ కాంప్లెక్స్‌లో సెల్లార్లను పార్కింగ్‌కు కేటాయించగా, ఓ సొంత భవనంలోని సెల్లార్‌లో ఓ పార్టీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు.

● అత్యధికంగా అనుమతుల్లేనివే?

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణ పరిధిలో సెల్లార్ల నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అత్యధికంగా అనుమతుల్లేకుండా ఏర్పాటు చేయడంతో పాటు అందులో చిరువ్యాపారులకు అద్దెకు ఇస్తున్నారు. కనీస జాగ్రత్తలు పాటించడంలేదు. ఇంత జరుగుతున్నా అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. సూర్యాపేట పరిధిలో 48వార్డులు ఉండగా 37,500 గృహాలు ఉన్నాయి. ముఖ్యంగా కుడకుడ ప్రాంతంలో, వాణిజ్యభవన్, ఎంజీ రోడ్డు, తాళ్లగడ్డ, అయ్యప్పనగర్, కలెక్టరేట్ ప్రాంతంతో పాటు వివిధ రకాల వ్యాపార సముదాయాల ప్రాంతంలో నూతన భవనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సెల్లార్లు ఉన్న భవనాలు 110కి పైగా అనుమతులు తీసుకోకుండా నిర్మించినవే ఉన్నాయి. ఇటీవల జాతీయ రహదారి వెంట నూతనంగా 10కి పైగా ప్రముఖ వస్త్ర, వ్యాపార షాపింగ్‌మాల్ నెలకొల్పారు. వీటికి సెల్లార్లు ఉన్నాయి. వీటిల్లో కొన్ని పార్కింగ్‌కు వినియోగిస్తున్నా కొన్ని మాత్రం పార్కింగ్‌తో పాటు వ్యాపార అవసరాలకు వాడుకుంటున్నారు.

దేవరకొండ : దేవరకొండ మునిసిపాలిటీలోని కొన్ని షాపింగ్ కాంప్లెక్స్‌ల సెల్లార్లలో నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు నిర్వహిస్తున్నారు. పట్టణ పరిధిలో 20 వార్డులు ఉండగా 55వేల జనాభా నివసిస్తోంది. 952 వాణిజ్య దుకాణాల సముదాయాలు ఉండగా ఐదు సెల్లార్లు ఉన్నాయి. సెల్లార్లలో కారు పార్కింగ్, వాహనాలు నిలుపుకోవడంతో పాటు దుకాణాలు ఏర్పాటుచేసి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారు. సెల్లార్లలో ప్రమాదాలు జరిగితే ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. సెల్లార్లలో అగ్నిమాపక వాహనం తిరిగేలా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. అయితే నిబంధనలు ఉల్లంఘిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

రైలుకు ఎదురువెళ్లి విద్యార్థి బలవన్మరణం


బొల్లెద్దు చందు (ఫైల్ ఫొటో)

నల్లగొండ క్రైం, ఆగస్టు 4: వేగంగా వస్తున్న రైలుకు ఎదురుగా వెళ్లి ఓ డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. రైల్వే ఎస్ఐ సాలకమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం శేషమ్మగూడెం గ్రామానికి చెందిన బొల్లెద్దు నగేష్-సరస్వతి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు భాను ఇటీవల డిగ్రీ పూర్తి చేయగా, చిన్న కుమారుడు బొల్లెద్దు చందు (20) నల్లగొండ ఎన్జీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. పార్ట్ టైమ్‌గా పనిచేసే ఆఫీసుకు వెళ్తున్నానని శనివారం సాయంత్రం ఇంటినుంచి వెళ్లిన చందు రాత్రి అయినా రాకపోవడం, ఫోన్ ఎత్తకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులను ఆరాతీయగా ఆచూకీ లభించలేదు. ఆదివారం తెల్లవారుజామున దుప్పలపల్లి బైపాస్ సమీపంలో ఉన్న రైల్వేట్రాక్‌పై ఛిద్రమైన మృతదేహంతో పాటు అక్కడున్న వస్తువులను స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. ద్విచక్రవాహనంతో పాటు సెల్‌ఫోన్ ఆధారంగా చందు మృతదేహంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో రైల్వేట్రాక్ వద్దకు వచ్చిన చందు తన ద్విచక్ర వాహనాన్ని సమీపంలో నిలిపి వేగంగా వస్తున్న రైలుకు ఎదురుగావెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. రైలు ఢీకొనడంతో మృతదేహం ఛిద్రంకాగా, నల్లగొండ జిల్లా కేంద్రాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. రాయినిగూడెం రైల్వేస్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రైల్వే ఎస్ఐ సాలకమ్మ తెలిపారు. చందు ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు వివిధ కోణాల్లో విచారణ ముమ్మరం చేశారు.

ఎదిగివచ్చిన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అశ్రునయనాల నడుమ చందు అంత్యక్రియలు నిర్వహించారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గట్టుప్పల్, ఆగస్టు 4 : చేనేత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, చేనేత సెల్ జిల్లా కన్వీనర్ వర్కాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండల కేంద్రంలో ఆదివారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే చేనేత కార్మికులను ఆదుకోవాలన్నారు. కష్టకాలంలో ఉన్న చేనేత రంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత కార్మికులకు రుణ సహాయాన్ని అందించాలన్నారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత సెల్ రాష్ట్ర కన్వీనర్ మచ్చా సుధాకర్‌రావు, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్, నల్లగొండ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్, చేనేత సెల్ రాష్ట్ర మాజీ కన్వీనర్ ఎన్నం శివకుమార్, కోమటి వీరేశం, రాపోలు గోపీనాథ్, చిలువేరు దుర్గయ్య, రావుల ఎల్లప్ప, నరేందర్, నామని దత్తాద్రి, కొంగరి పాండు, రాపోలు మారుకొండయ్య, తిరం దాసు చంద్రమౌళి, జంగయ్య, ఆంజనేయులు, కర్నాటి ప్రవీణ్, శంకర్, వెంకటేశం, కర్నాటి రవితేజ, శ్రీకాంత్, శివశంకర్, బీజేపీ, యువ మోర్చా నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


గట్టుప్పల్‌లో నిర్వహించిన మహాధర్నాలో పాల్గొన్న బీజేపీ నాయకులు వర్షిత్‌రెడ్డి, శ్రీనివాస్

డిండి ఎత్తిపోతల డీపీఆర్‌ను ఆమోదించాలి

మర్రిగూడ, ఆగస్టు 4 : డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించి పనులు పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఈ నెల 9న నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక ఫ్లోరిన్ ఈ ప్రాంతంలోనే ఉందని, దీంతో ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. సాగునీరు లేకపోవడంతో భూములు బీళ్లుగా మారాయన్నారు. ప్రాజెక్టు పూర్తి కోసం సీపీఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఇటీవల సీపీఎం ఆధ్వర్యంలో ప్రాజెక్టుల పరిశీలన చేశామని, ఈ నెల 9న నల్లగొండ జిల్లాకేంద్రంలో జరిగే సదస్సుకు పెద్దఎత్తున ప్రజలు హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, మర్రిగూడ మండల కార్యదర్శి వేర్పుల యాదయ్య, నాంపల్లి మండల కార్యదర్శి చంద్రమౌళి, సీపీఎం నాయకులు బొట్టు శివకుమార్, ఖైల సత్తయ్య, కొమ్ము లక్ష్మయ్య, నీలకంఠ రాములు, కొట్టం యాదయ్య, దామెర లక్ష్మి, మల్లెటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సుధాకర్‌రెడ్డి, సీపీఎం నాయకులు

కొండమల్లేపల్లి: డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను వెంటనే ఆమోదించాలని కోరుతూ ఈ నెల 9న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. సమావేశంలో చింతపల్లి మండల కార్యదర్శి ఉడుగుండ్ల రాములు, ఎల్లయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

చండూరు, ఆగస్టు 4 : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో నల్లగొండ జిల్లా చండూరుకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. ఆదివారం నకిరేకల్ పట్టణంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 38వ షాటోఖాన్ జాతీయ పోటీల్లో చండూరుకు చెందిన 10 ఏళ్ల లోపు విద్యార్థులు కాంస్య పతకాలు గెలుపొందారు. గీతా విద్యాలయానికి చెందిన సంకోజు సాయిప్రణయ్, సంకోజు మణిదీప్, కారింగు అభిరామ్, కృష్ణవేణి విద్యాలయానికి చెందిన ఇరిగి భానుతేజలు ఈ పతకాలు సాధించారు. విద్యార్థులకు ఎమ్మెల్యే వేముల వీరేశం మెడల్స్‌ను అందజేశారు. వీరికి శిక్షణ ఇచ్చిన మాస్టర్ కారింగు రవికి ఎమ్మెల్యే మెమోంటో అందజేసి, అభినందించారు. విద్యార్థులు పతకాలు సాధించడంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాస్టర్స్ రాపోలు సుదర్శన్, అంతటి సోములుగౌడ్, నగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కాంస్య పతకాలతో విద్యార్థులు

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, ఆగస్టు 4 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లిలోని లక్ష్మీనృసింహుని క్షేత్రంలో స్వామి వారి నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు మూలవర్యులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పుష్పాలంకరణల అనంతరం ఆరెపత్రితో అష్టోత్తర నామార్చనలు, యాగ మండపంలో నారసింహ సుదర్శన హోమలు చేపట్టారు. క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన జరిగింది. అనంతరం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. రాజ్యలక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, మహార్నివేదనలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సరికొండ నవీన్, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.


కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

లారీని ఢీకొన్న కారు : ఒకరి మృతి

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 4 : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. సీఐ అశోక్ రెడ్డి ఆదివారం తెలిపిన వివరాలు ప్రకారం ఖమ్మం జిల్లా వైరా నుంచి పదిమల వీరభద్రరావు(68) ఆయన కుమారుడు జగదీష్, బంధువు నితీష్‌కుమార్ కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. లింగోజిగూడెం వద్దకు రాగానే కారు ముందుగా వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో పదిమల వీరభద్రరావు మృతి చెందగా, జగదీష్, నితీష్‌కుమార్ స్వల్పంగా గాయపడ్డారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు, డీసీఎం ఢీ

- డ్రైవర్లకు తీవ్రగాయాలు
- క్యాబిన్‌లో ఇరక్కున్న డీసీఎం డ్రైవర్
- అతికష్టం మీద బయటికి లాగిన పోలీసులు


దెబ్బతిన్న వాహనాలు, రాకపోకలను పునరుద్ధరిస్తున్న పోలీసులు

కనగల్, ఆగస్టు 4 : నల్లగొండ జిల్లా కనగల్ మండం జీ చెన్నారం సమీపంలో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు డీసీఎం ఎదురెదురుగా ఢీకొనడంతో ఇరు వాహనాల డ్రైవర్లు తీవ్రగాయాల పాలయ్యారు. కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోగా, గంట పాటు శ్రమించి డీసీఎం డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి బయటకు తీశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ నుంచి చండూరుకు నైట్‌హాల్ట్ బస్సు కనగల్ మీదుగా వెళుతోంది. మండలంలోని నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిపై జీచెన్నారం స్టేజీ సమీపంలో ఎదురుగా నల్లగొండకు వైపు వస్తున్న డీసీఎం ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టింది. దీంతో వాహనాల ముందుభాగాలు నుజ్జునుజ్జు కాగా ఇరువురు డ్రైవర్లు క్యాబిన్లలో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు బస్సు డ్రైవర్‌ను త్వరగానే బయటికి లాగి 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటిలోగా ఎస్ఐ విష్ణుమూర్తి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డీసీఎం క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను గంటపాటు కష్టపడి బయటకు తీశారు. అనంతరం చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలించారు. అంతసేపు రక్తమోడుతూ డ్రైవర్లు నరకయాతన అనుభవించారు. బస్సు డ్రైవర్ కనగల్ మండలం దోరెపల్లి గ్రామానికి చెందిన ఎరుకల బిక్షంగా గుర్తించారు. ఇదిలా ఉండగా బస్సులోని నలుగురికి ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. వారు కూడా 108 వాహనంలో నల్లగొండలోని ఆసుపత్రికి వెళ్లారు. మిగతా ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్లో చండూరుకు వెళ్లారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేని ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు.

రూ.88 వేలు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

మోత్కూరు, ఆగస్టు 4 : సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా పలువురు సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు పోగొట్టుకుంటూనే ఉన్నారు. క్రెడిట్ కార్డుదారుడి నుంచి రూ.88 వేలు కొల్లగొట్టిన సంఘటన ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులో వెలుగులోకి వచ్చింది. మోత్కూరుకు చెందిన వ్యాపారి క్రెడిట్‌కార్డ్ ఉపయోగిస్తున్నాడు. అతడికి ఇటీవల పలు మెస్సేజీలు రాగా వాటికి సమాధానం ఇచ్చాడు. గత నెల(జూలై) 15కు ముందు ఒకసారి రూ.40 వేలు, ఆ తర్వాత 15న మరోసారి రూ.48 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. అది గమనించని సదరు వ్యాపారి తన క్రెడిట్ కార్డ్ సక్రమంగా పనిచేయడం లేదంటూ మూడు రోజుల క్రితం క్రెడిట్‌కార్డులు ఇచ్చే వ్యక్తికి చూపించాడు. అతడు కార్డు ద్వారా రూ.88 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారని ఆ వ్యాపారికి చెప్పి, ఆ కార్డు బ్లాక్ చేసి కొత్త కార్డు ఇచ్చాడు. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదుచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

స్నేహితుడిపై దాడిని అడ్డుకోబోయి గాయాలు

హుజూర్‌నగర్, ఆగస్టు 4 : స్నేహితుడిపై కత్తితో దాడిని అడ్డుకోబోయిన ఓ వ్యక్తి గాయాలపాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బూరుగడ్డ గ్రామానికి చెందిన చింతా నవీన్, నేరేడుచర్లకు చెందిన యడవెల్లి వరుణ్‌కు పాతకక్షలు ఉన్నాయి. మధ్యాహ్నం పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు ఇందిరాసెంటర్‌లో ఉన్న రమ్మని నవీన్‌కు వరుణ్ ఫోన్ చేశాడు. తన స్నేహితులతో నవీన్ అక్కడికి వెళ్లగా వరుణ్ తన బైక్‌తో ఢీకొట్టి వెంట తెచ్చుకున్న కత్తితో నవీన్‌పై దాడి చేశాడు. అడ్డుకోబోయిన గోపాలదాసు కిరణ్‌ను కూడా దాడిచేసి గాయపర్చాడు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దాడిలో గాయపడ్డ నవీన్, కిరణ్‌లు స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

చేనేత కార్మికులపై చిన్నచూపు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయ్య

భువనగిరి టౌన్, ఆగస్టు 4: చేనేత కార్మికులపై ప్రభుత్వానికి చిన్నచూపు తగదని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు తిరందాసు ధనుంజయ్య అన్నారు. భువనగిరిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమష్టిగా ఉంటేనే రాజకీయ గుర్తింపు, ఆర్థిక స్వావలంబన, ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరుతుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా బింగి నర్సింహ, ఎలిమినేటి కుమార్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో నాయకులు సిద్దుల పద్మ, గుజ్జ అశోక్, చిట్టిపోలు శ్రీధర్, అమృతం ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

13న మాదిగల విజయోత్సవ ర్యాలీ



అభివాదం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భువనగిరి టౌన్, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఈ నెల 13వ తేదీన భువనగిరిలో మాదిగల విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. భువనగిరిలో ఆదివారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో మాదిగల జీవితాలు మారనున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలన్నారు. ఇప్పటికే జారీ చేసిన ఉద్యోగ నియామకాల షెడ్యూల్‌లో సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లలో మార్పులు చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, నాయకులు భట్టు రాంచంద్రయ్య, సందెల శ్రీనివాస్, బర్రె సుదర్శన్, దర్గాయి హరిప్రసాద్, కోళ్ల జహంగీర్, ఇంజ మహేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మోటకొండూరు, బొమ్మలరామారం, ఆగస్టు 4: సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. మోటకొండూరు మండలకేంద్రానికి లబ్ధిదారుడికి మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును కాంగ్రెస్ జిల్లా నాయకుడు భాస్కరుని రఘునాథరాజు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భూమండ్ల అశోక్, ఆలేరు బుగ్గ మహేష్, బాల్ద రామకృష్ణ, భూమండ్ల శ్రీనివాస్, బాల్ద సిద్ధులు, రాములు, జూకంటి మాధు, భూమండ్ల ఉమేష్ పాల్గొన్నారు. బొమ్మలరామారం మండలంలోని సోలిపేట గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ జడ్పీటీసీ చీర రాజేశ్వర్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ మందాల రామస్వామి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెడ్యానాయక్, రవీందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, పూడూరు ఆంజనేయులుగౌడ్, శ్రీకృష్ణ ఉపేందర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు



ఫ్రెండ్‌షిప్ డేలో పాల్గొన్న పట్టణవాసులు

భువనగిరి టౌన్, ఆగస్టు 4: ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను భువనగిరిలో ఆదివారం ఉత్సాహంగా జరుపుకున్నారు. భువనగిరి ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పరస్పరం ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లను ధరించారు. అన్నదానం నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, పబ్బ చంద్రశేఖర్‌గుప్తా, నరాల సంతోష్, చీకటిమల్ల రాములు, జంగాల హనుమంత్‌రావు, పాలకుర్తి వేణుమాధవ్, అరూర్ రవికాంత్ పాల్గొన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కరిపె నర్సింగ్‌రావు, సత్యనారాయణరెడ్డి, శెట్టి బాలయ్యయాదవ్, బండారు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆలేరు రూరల్, ఆగస్టు 4: ప్రజలు చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని ఎస్ఐ వెంకట శ్రీను అన్నారు. స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బందికి ఆదివారం చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సమాజ అభివృద్ధికి తమవంతు కృషి చేయాలన్నారు.

'భూపాల్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం'

వలిగొండ, ఆగస్టు 4: మండలంలోని అరూరు గ్రామానికి చెందిన బండారు భూపాల్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీఎన్‌రెడ్డి అన్నారు. భూపాల్‌రెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులకు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. పిల్లల చదువుకు, భవిష్యత్తుకు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, యాదిరెడ్డి, రాము, నారాయణ, నాగరాజు, బిక్షపతి, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కట్ట కుంగి.. పగుళ్లు పట్టి

● ఐదేళ్లకే కుంగిన మోత్కూరు మినీ ట్యాంక్‌బండ్ కట్ట ● భారీ వాహనాలు వెళితే తప్పని ప్రమాదం



మోత్కూరులో కుంగిన మినీ ట్యాంక్‌బండ్ కట్ట

మోత్కూరు, ఆగస్టు 4: మోత్కూరు మినీట్యాంక్ కట్ట నిర్మించిన ఐదేళ్లకే కుంగింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి ఒక మినీ ట్యాంక్‌బండ్ నిర్మించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో మోత్కూరు పట్టణాన్ని అనుకుని పెద్ద చెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్‌గా నిర్మించేందుకు రూ.4.90 కోట్లు మంజూరు చేశారు. 2017 మేలో అప్పటి మంత్రులు టి. హరీ‌ష్‌రావు, గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ పనులు ప్రారంభించారు. నాణ్యత లోపంతో పనులు జరుగుతున్నాయని ప్రారంభంలోనే ఆరోపణలు వచ్చాయి. కట్టకు రెండు వైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించి మధ్యలో బీటీ చేయకపోవడంతో అప్పుడు ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చేశాయి. 2018 ఎన్నికల ముందు చెరువుకట్టపై బీటీ చేశారు. సుందరీకరణ లేకుండా 2019లో ట్యాంకుబండ్ పనులు పూర్తయ్యాయనిపించారు.

పగుళ్లతో మట్టి కొట్టుకుపోతున్న కట్ట

ట్యాంకు బండ్(చెరువుకట్ట) కొంతదూరం కుంగింది. ఫుట్‌పాత్, కట్ట పగుళ్లుపట్టి అస్తవ్యస్తంగా మారింది. వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు ఆ పగుళ్లలోంచి వెళ్లి కట్ట మట్టి కొట్టుకుపోతోంది. మోత్కూరు నుంచి అడ్డగూడూరు, తిరుమలగిరి తదితర మండలాలకు, సూర్యాపేట, తొర్రూరుకు వెళ్లడానికి ప్రధాన రహదారి కావడంతో ప్రతిరోజుకూ ఈ కట్టపై నుంచి ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలు వెళ్తుంటాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడో, ఒకే వైపు వెళుతున్నా వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలోనో ఆర్టీసీ బస్సుగాని, ఇతర భారీ వాహనం గాని కుంగిన చోటు నుంచి వెళితే కట్ట కూలిపోయి వాహనం పల్టీ కొట్టే ప్రమాదముందని స్థానికులు తెలిపారు. నాణ్యతగా పనులు చేయకపోవడంతో కట్ట కుంగిందని ప్రజలు ఆరోపిస్తుండగా, కట్ట మట్టి జారిపోకుండా పొలాల వైపు రాయితో సోలింగ్ చేయకపోవడంతో కుంగిందని అధికారులు చెబుతున్నారు. చెరువు కట్టలపై ఉన్న రోడ్లను తరుచూ కన్సాలిడేషన్ (మరమ్మతు) చేస్తుంటారని, ఇక్కడ అది జరగడంలేదని ప్రజలు అంటున్నారు. సుమారు ఏడాది నుంచి పగుళ్లు వచ్చి కట్టపై క్రమంగా కుంగుబాటు పెరుగుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.



కానరాని సుందరీకరణ

సాయంత్రం వేళ కుటుంబసభ్యులతో కలిసి మినీ ట్యాంక్‌బండ్ వద్దకు వెళితే ఆహ్లాదం, మానసిక ప్రశాంతత చేకూరుతాయని భావించారు. అక్కడ మచ్చుకైనా సుందరీకరణ కన్పించదు. కట్టకు ఇరువైపులా పెరిగిన కంప, జిల్లేడు చెట్లే దర్శనమిస్తాయి. నిర్మించిన రేలింగ్ కూడా పలు చోట్ల దెబ్బతిన్నది. అనుబంధంగా పార్కు నిర్మిస్తామని చెప్పినా అది ఆచరణ కాలేదు. ట్యాంక్‌బండ్‌లా కాకుండా సాధారణ రహదారిగా మిగిలింది.

కుంగిన చోట మరమ్మతుకు టెండర్ పిలిచాం

మినీట్యాంకు బండ్‌పై కుంగిన చోట మరమ్మతు చేయించడానికి రూ.3 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరయ్యాయి. టెండర్ పిలిస్తే కాంట్రాక్టర్లు రాలేదు. రెండోసారి టెండర్లు పిలిచాం. ఈ నెల 2వ తేదీతో గడువు ముగిసింది. టెండర్లు తెరిచి చూసి ఎవరైనా కాంట్రాక్టర్ టెండర్ వేస్తే పనిచేయిస్తాం. ● చంద్రశేఖర్, ఐబీ ఏఈ.

ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్‌దే విజయం : సామేలు



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

అడ్డగూడూరు, ఆగస్టు 4: ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్‌దే విజయమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఆదివారం మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామానికి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను గెలిచిన వెంటనే గ్రామానికి రూ.20లక్షలతో సీసీరోడ్డు, గట్టు సింగారం రోడ్డుకు మొరం పోయడానికి రూ.3.5లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గట్టుసింగారం రోడ్డుకు బీటీ చేయడానికి, నబ్బుగూడెం రోడ్డుకు కంకర, మర్లపాయ రోడ్డుకు ఫార్మరేషన్, ఎస్సీ కమ్యూనిటీహాల్, స్మశానవాటిక వరకు సీసీరోడ్డు, గ్రామపంచాయతీ కార్యాలయానికి అదనపు గదులు, గ్రంథాలయం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ రూ.2లక్షలు ఈ నెల 15వ తేదీ లోపు పూర్తవుతుందని తెలిపారు. అనంతరం సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోలేబోయిన లింగయ్య, సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి నిమ్మనగోటి జోజి, దామెర్ల వీరయ్య, కన్నెబోయిన గంగరాజు, బొమ్మగాని భద్రయ్య, అక్కనపల్లి నర్సయ్య, పొన్నాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఈ నెల 5న మండలంలోని దాచారం గ్రామంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభిస్తారని ఏపీవో కరుణాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రామన్నపేట: సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

రామన్నపేట, ఆగస్టు 4: మండలకేంద్రంలోని విజ్ఞానవర్ధిని హైస్కూల్ 2007-2008 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు అమృతవనంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చాలా కాలం తర్వాత కలుసుకున్న వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జీవీ. సురేష్, కరస్పాండెంట్ కే. యాదగిరిరెడ్డి, పోతరాజు శంకరయ్య, బేతోజు సత్యనారాయణ శాస్త్రి, రఫీక్ రామచంద్రారెడ్డి, ఉయ్యాల బిక్షమయ్య, పూర్వ విద్యార్థులు ఏ. ఆదిత్య, మీర్జా నమీబేగ్, బుర్రి మహేష్, సైదులు, ఎం రాఘవేంద్ర, ఎస్. సైదులు తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్: చౌటుప్పల్‌లోని జడ్పీహెచ్‌ఎస్ 1992-93 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా అందరూ ఒకేచోట కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఆకిటి ప్రతాప్‌రెడ్డి, ప్రసాదరావు, పంతంగి రంగారావు, పాండురంగ విఠల్, ధనుంజయ్య, ఊషయ్యను సన్మానించారు.

మోడల్ స్కూల్ విద్యార్థికి డెంగీ

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 4: చౌటుప్పల్ పట్టణంలోని మోడల్ స్కూల్ విద్యార్థికి(15) డెంగీ సోకడంతో స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అటవీ ప్రాంతంలో ఉన్న మోడల్ స్కూల్‌లో దోమల బెడద అధికంగా ఉండడంతో విద్యార్థికి డెంగీ సోకినట్టు భావిస్తున్నారు. మిగతా విద్యార్థులకు డెంగీ సోకే ప్రమాదముందని అనుమానిస్తున్నారు. ఈ స్కూల్‌లో రెసిడెన్షియల్‌తో పాటు జూనియర్ కళాశాల కూడా నిర్వహిస్తున్నారు. విద్యార్థికి డెంగీ సోకిన సమాచారం తెలిసిన తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది.

ఏఈవోలకు స్వచ్ఛదనం-పచ్చదనం విధులు

మోత్కూరు, ఆగస్టు 4: ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో ఏఈవోలను చేర్చడం పట్ల వారు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పనిభారంతో సతమతమవుతున్న తమకు అదనపు పనులు చెప్పడమేమిటని ప్రశ్నిస్తున్నారు. రైతు బీమా, పంటల నమోదు, రైతు రుణమాఫీ కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. పంటల నమోదుకు క్షేత్రాల మీదకు వెళుతున్నామంటున్నారు. రైతు బీమా, రైతు రుణమాఫీపై దరఖాస్తు చేసుకోవడానికి, వివరాలు తెలుసుకోవడానికి రైతులు రైతు వేదికల వద్దకు వస్తున్నారని, తాము స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి వెళితే తమ కోసం వచ్చిన రైతులు తాము లేకపోవడం చూసి తమనే నిందిస్తూ వెళ్తున్నారని ఏఈవోలు అంటున్నారు. రైతులకు సంబంధించిన పనులు ఎక్కువగా ఉన్నందున తమను స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ విధుల నుంచి తప్పించాలని కోరుతున్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

వలిగొండ, ఆగస్టు 4: అక్రమంగా గుట్కా ప్యాకెట్లను నిల్వ చేసి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వలిగొండ ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రానికి చెందిన ఒక పాన్‌షాప్ యాజమాని నిషేధం విధించిన గుట్కా ప్యాకెట్లను కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. తనిఖీలు చేయగా సదరు వ్యాపారి నుంచి ఆర్ఆర్ పొగాకు 40 పౌచ్‌లు, స్వాగత్, సాగర్ 50 పౌచ్‌లు అంబర్ 15 పౌచ్‌లు, మరికొన్ని గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వర్షాలు కురవాలని కప్ప కాముడు



కప్ప కాముడు ఆడుతున్న మహిళలు

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 4: వర్షాలు కురవాలని మండలంలోని జనగాం గ్రామంలో ఆదివారం గ్రామ మహిళలు కప్ప కాముడు ఆడారు. కొంతకాలంగా సరైన వర్షాలు లేక పాడిపంటలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో మంచినీటి సమస్య సైతం నెలకొందన్నారు. సకాలంలో వర్షాలు కురిపించి పాడి పంటలు పండేలా ప్రజలందరూ సుఖశాంతులతో ఉండేలా చూడాలని వారు వేడుకున్నారు.

కుల గణన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బందెల విష్ణుమూర్తి

ఆలేరు రూరల్, ఆగస్టు 4: కుల గణన చేపట్టిన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని మోస్ట్ బ్యాక్వర్డ్ షెడ్యూల్ క్యాస్ట్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు బందెల విష్ణుమూర్తి డిమాండ్ చేశారు. ఆలేరులో ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఎస్సీలోని 57ఉప కులాలు స్వాగతిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఎస్సీ జాబితాలో 59కులాలు ఉన్నాయని, స్వాతంత్య్రం వచ్చి 77సంవత్సరాలు కావస్తున్నా రెండు మెజార్టీ కులాలు మాత్రమే లాభపడ్డాయన్నారు. ఎస్సీ జాబితాలోని ఇతర కులాలకు ఆర్డీవో, కలెక్టర్ కాకుండా తహసీల్దార్ స్థాయిలోనే కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు బెదరకోట దుర్గేష్, దర్శనం శ్రీను, చంద్రగిరి, లింగం, నర్సింహులు, వెంకటేష్, రమేష్, అశోక్, సాంబయ్య పాల్గొన్నారు.

చంద్రబాబు, మంద కృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం



చౌటుప్పల్‌లో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 4: ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే నారా చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నారని టీడీపీ మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ బడుగు లక్ష్మయ్య అన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం తీర్పు అనుకూలంగా వచ్చిన సందర్భంగా చౌటుప్పల్ పట్టణంలో నారా చంద్రబాబునాయుడు, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సుంకరి జంగయ్య, నాయకులు చిలువేరు రాజు, వర్కాల వెంకటేష్, నల్ల పర్వతాలు, బోసి నర్సింహ, ఎం. రాములు, బోదుల గణేష్, జి. పాండు, టి. శ్రీను, సాయితేజ, సాయి కిరణ్, బాబు, మనోజ్‌కుమార్, వాసు, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు మండలంలోని వెల్లంకి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేడ్కర్, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కంతాల దేవేందర్, బర్ల రవి, తయారీ కంట్రీజు సంజీవ, చేకూరి మల్లేష్ పాల్గొన్నారు.

వయనాడ్ వరద బాధితులకు అండగా ఉందాం



వలిగొండ మండలం పులిగిల్ల గ్రామంలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

వలిగొండ, ఆగస్టు 4: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులకు సహాయన్ని అందించి అండగా నిలవాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి పిలుపునిచ్చారు. వయనాడ్ వరద బాధితుల సహాయార్థం మండలంలోని పులిగిల్ల గ్రామంలో ఆదివారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో పర్యాటక ప్రాంతం అయిన కేరళ ప్రకృతి వైపరీత్యాలకు కురుస్తున్న అకాల వర్షం కారణంగా వయనాడ్ ప్రాంతంలోని ప్రజల జీవితాలు చిన్నభిన్నం అయ్యాయన్నారు. సుమారు 300 మందికిపైగా ఇప్పటికే మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రమౌళి, బిక్షపతి, వెంకటయ్య, సత్తిరెడ్డి, ముత్యాలు, శంకరయ్య, అనిల్, నర్సింహ, బాబు, టెండూల్కర్, జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులకు సాయం అందించేందుకు దాతలు ముందుకు రావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, ఎండీ. పాషా కోరారు. వయనాడ్ వరద బాధితుల కోసం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం చౌటుప్పల్‌లో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండారు నర్సింహ, గంగదేవి సైదులు, ఆకుల ధర్మయ్య, కొండె శ్రీశైలం, నందీశ్వర్, ఎర్ర ఊషయ్య, టి. మల్లేశ్, బోయ యాదయ్య, యాట బాలరాజ్, జక్కిడి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టుపట్టారు.. కొలువు కొట్టారు..



భువనగిరి టౌన్, ఆగస్టు 4: పట్టుదలే లక్ష్యంగా పుస్తకాలతో కుస్తీపట్టిన వ్యవసాయ కుటుంబానికి చెందిన ఓ యువకుడు ఆరేళ్లగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. నాలుగో ప్రయత్నంలో ఇంజనీర్ కావాలనే తన లక్ష్యం నెరవేరిందని సంతృప్తి వ్యక్తం చేస్తున్నాడు. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన నడ్డి గోపాలకృష్ణ భువనగిరిలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల వెల్లడైన ఏఈఈ ఫలితాల్లో మిషన్ భగీరథలో ఏఈఈగా ఉద్యోగం సాధించాడు. గతంలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినప్పటికీ తన లక్ష్యమైన ఏఈఈ కోసం పట్టువదలకుండా చదివాడు. నడ్డి రాంచంద్రయ్య, అంజమ్మ దంపతులది వ్యవసాయ నేపథ్యం వీరికి ముగ్గురు కూతుళ్లు ఇద్దరు కొడుకులు ఉన్నారు. ముగ్గురు కూతుళ్ల వివాహం చేసిన ఆ దంపతులు తమ ఇద్దరు కొడుకులను ఉన్నత స్థానమే లక్ష్యంగా చదివించారు. 2018లో గ్రామపంచాయతీ కార్యదర్శిగా ఎంపికైన గోపాలకృష్ణ తమ సొంత మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా 11నెలలు ఉద్యోగం చేశాడు. ఆ వెంటనే 2019లో రైల్వేలో గ్రూప్-డి ఉద్యోగం గుంటూరు రైల్వే జంక్షన్ సత్తుపల్లిలో వచ్చింది. కానీ ఆ ఉద్యోగంలో చేరలేదు. గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూనే ప్రతినిత్యం క్రీడలు ఆడడంతో పాటు మైదానంలో శారీరక పటుత్వానికి శ్రమించాడు. ఫలితంగా 2020 జనవరి 18న కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికై భువనగిరి ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఏఈఈ ఉద్యోగ నియామకాల పరీక్షలకు గోపాలకృష్ణ హాజరయ్యాడు. రెండు రోజుల క్రితం టీజీపీఎస్సీ వెల్లడించిన తుది ఫలితాల్లో మిషన్ భగీరథలో ఏఈఈగా ఉద్యోగం లభించింది. త్వరలోనే గెజిటెడ్ హోదా గల ఏఈఈ ఉద్యోగంలో చేరనున్నట్లు తెలిపాడు.

ఫైర్ కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూనే..



వలిగొండ: వలిగొండ మండలంలోని వెల్వర్తి గ్రామానికి చెందిన బోదాసు హరిప్రకాష్ మిషన్ భగీరథ డిపార్ట్‌మెంట్ ఏఈఈగా ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఫైర్ కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్నాడు. బోదాసు శ్రీనివాస్-సునీత దంపతులు నిరుపేదలు, బండలు(రాళ్లు) కొడుతు జీవనం సాగిస్తున్నారు. వీరికి హరిప్రకాష్, అనిల్ ఇద్దరు కుమారులు. వీరు కష్టపడి తమ కుమారులను చదివించారు. పెద్ద కుమారుడు హరిప్రకాష్ పట్టుదలతో చదివి ఏఈఈ ఉద్యోగం సాధించాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే వారి కష్టంతోనే తాను ఉద్యోగం సాధించినట్లు హరిప్రకాష్ తెలిపారు. పోటీ పరీక్షల కోసం సొంతంగా సిద్ధమైనట్లు తెలిపారు. తన జేఎన్‌టీలో లైబ్రేరీ చాలా ఉపయోగపడిందని ఉపాధ్యాయుల మార్గదర్శకంలో చదివినట్లు తెలిపారు. నేటి యువత నిరుత్సాహపడకుండా ప్రణాళికా బద్ధంగా చదివితే ఉద్యోగం సాధించడం సులభమని తెలిపారు.

పేదరికం నుంచి ఏఈఈగా



మోత్కూరు: టీజీపీఎస్ విడుదల చేసిన ఏఈఈ ఫలితాల్లో మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన బుంగ నాగరాజు రాష్ట్రస్థాయిలో 794వ ర్యాంకు సాధించాడు. ఆ ర్యాంకుతో పబ్లిక్ హెల్త్ అండ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంటు డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ)గా (సివిల్) ఉద్యోగం పొందాడు. నాగరాజు తండ్రి సోమయ్య పారిశుధ్య కార్మికుడు కాగా, తల్లి ప్రమీల వ్యవసాయ కూలీ. తల్లిదండ్రులు కుమారుడిని కష్టపడి చదివించారు. నాగరాజు ఉస్మానియా యూనివర్సిటీలో ఎంటెక్ (సివిల్) చదివి. ఏఈఈ పోటీ పరీక్ష రాసి, విజయం సాధించాడు. తమ కుమారునికి రాష్ట్రస్థాయి ర్యాంకు వచ్చి మంచి ఉద్యోగం లభించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.